

యానాంలో ఇటీవల రూ.18 వేలకు విక్రయించిన పులస



ఆదివారం ప్రత్యేకం

యూండే.. పులసండే..

- గోదారి ఎర్రనీట్లో సందడి చేస్తోన్న పులస చేప
- గతంతో పోల్చితే ఇవి అరుదుగా దొరుకుతుండడంతో భారీ ధర
- ఇటీవల రూ.18 వేలు పలికిన కేజీన్నర చేప.. గతేడాది ఏకంగా రూ.25 వేలు
- సీజన్ ప్రారంభమవడంతో ఈ దఫా అయినా భారీగా దొరికేనా అని మత్స్యకారుల్లో ఆశ

పులస... పులసోయ్ పులస... నోరూరించే పులస.. పుస్తెలమ్మయినా కొనుక్కుని తినాల్సిన పులస.. సాధారణంగా ఏ స్వీట్లు గురించో వింటే ఠక్కున నోరూరుతుంది.. చేపల్లో పులస గురించి వింటే జిహ్వాచాపల్యం ఆగదు.. ఎలాగైనా.. ఎంత పెట్టి కొని అయినా తినాలనిపించే ఈ చేప గురించి ఎంత చెప్పినా తక్కువే.. వర్షాకాలం వస్తే గోదావరికి ఎర్రనీరు ఎలా పోటెత్తుతుందో... పులస కూడా అలా సముద్రం నుంచి గోదావరికి ఎదురీది పులస ప్రియుల నోట్లోకి జారుతుంది.. సాధారణంగా చికెన్..మటన్.. చేప తింటే బయటకొచ్చి దీని గురించి ఎవరూ పెద్ద గొప్పగా చెప్పుకోరు.. కానీ పులస తిన్నవాళ్లు మాత్రం రోజుల తరబడి ఊరంతా చెప్పుకోవడం ఓ ప్రెస్టేజీ కూడా.. గోదారోళ్లకు మహా ఇష్టమైన...ఖరీదైన.. చుట్టాలు, స్నేహితులకు గొప్ప గిఫ్ట్‌లా పేరొందిన పులస సీజన్ ఇప్పుడు గోదావరిలో మొదలైంది. భారీ వర్షాలతో వరద పోటెత్తుతుండడంతో ఒక్కో పులస అలా అలా ఈదుకుంటూ పులసప్రియుల నోటికి చిక్కడానికి ఇప్పుడిప్పుడే కదులుతోంది... పదండి... ఇంకా దీని గురించి చెప్పుకుందాం...

(కాకినాడ/యానాం-ఆంధ్రజ్యోతి)

వానాకాలం వస్తే అందరి నోట్లో నానే పదం పులస. ఇప్పుడు వానాకాలం కావడంతో గోదావరి ఎర్రనీరు సముద్రంలో కలుస్తుండడంతో పులసల సీజన్ మొదలైపోయింది. ఇప్పటికే యానాం గౌతమి గోదావరిలో అక్కడక్కడా పులసలు దొరుకుతున్నాయి. ఇటీవల యానాం మార్కెట్‌లోకి పలువురు వ్యాపారులు పులసలను తెచ్చి విక్రయించారు. వేలు ఖర్చుపెట్టి మరీ ఈ చేపలు కొనేందుకు ఎగబడ్డారు. వాస్తవానికి పుస్తులమ్మయినా పులస తినాలి అనేది గోదావరి జిల్లాల్లో పులస చేప కోసం వినబడే నానుడి. ఎందుకంటే దీని ధర ఎంతకు ఎగబాకుతుందో ఎవరికీ తెలియదు. చేపలను మార్కెట్లో ఇలా వెళ్లి అలా తెచ్చుకోవచ్చు.. కానీ పులసను మాత్రం వేలంలోకి వెళ్లి తెచ్చుకోవాలి. ఎందుకంటే దీనికి ఉన్న గిరాకీ అంత మరి. ధనవంతుల నుంచి సెలబ్రిటీల వరకు.. మధ్యతరగతి నుంచి సామాన్యుల వరకు పులస వచ్చిందా.. పులస దొరుకుద్దా.. అంటూ ఈ సీజన్‌లో ఆరా తీయడం మామూలుగా ఉండదు. చాలామంది తమ పనుల కోసం ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు, కావాల్సిన పనులను చేయించుకునేందుకు ఈ పులస పులను పంపడం ఓ అనవాయితీగా మారింది. అంతేకాదండోయ్.. ఈ సీజన్‌లో విదేశాల్లో ఉన్న గోదావరివాసులు తమ వారితో సరదాగా పులస దొరికిందా.. పులస తిన్నారా అని అడగకుండా ఉండరంటే అతిశయోక్తికాదు.

పులసే తినాలా...

అవును.. పులసే తినాలి.. ఇది తింటే ఆ రుచే వేరు.. వాస్తవానికి ఇవి వెండి రంగులో ఉంటాయి. ఆరోహక వలస జాతికి చెందిన పులసలు సాధారణంగా సముద్రంలో జీవిస్తాయి. అయితే సంతాన ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హిందూ మహాసముద్రంలో ప్రవేశించి అక్కడ నుంచి బంగాళాఖాతం గుండా వరదల సమయంలో గోదావరిలోకి వచ్చి చేరతాయి. గోదావరి వరదనీరు వచ్చి సముద్రంలో కలిసే సమయంలో గుడ్లు పెట్టిన తర్వాత అక్టోబర్ నాటికి తిరిగి సాగరానికి చేరుకుంటాయి. అలా వెళ్లే క్రమంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరదలు వచ్చినప్పుడు కొన్ని చేపలు సముద్రం నుంచి గోదారిలో ఎదురీదుకుంటూ వెళ్తూ జాలర్లకు చిక్కుతాయి. పూర్వం సముద్రంలోంచి ఈదుకుంటూ ధవళేశ్వరం బ్యారేజీ వరకు వెళ్లేవి. బ్యారేజీ దిగువన పులసల్లంక అనే లంక కూడా ఉంది. అరుదైన ఈ పులస చేపలు గోదావరిలో తప్ప ఇంకెక్కడా దొరకవు. అందుకే అంత గిరాకీ. వాస్తవానికి పులస సముద్రంలో ఉంటే విలస చేప.. నదిలో దొరికితే పులస అవుతుంది. గత పది రోజుల నుంచి గౌతమి గోదావరిలోకి ఎర్రనీరు రావడంతో పులసలు వచ్చి పడుతున్నాయి. వాస్తవానికి ఈ పులస యానాం వద్ద సముద్రం నుంచి ఎగువకు గోదావరిలో ఎగబాకుతూ ధవళేశ్వరం వరకు ఎదురెళ్తాయి. ఈ క్రమంలో ఎక్కడ మత్స్యకారులకు చిక్కుతుందో తెలియదు. చిక్కిందంటే పంట పండినట్టే.

ఎన్ని ప్రత్యేకతలో..

నదీ ప్రవాహానికి అతివేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. పులస చనిపోయినా రెండు రోజుల వరకు కూడా పాడవకుండా ఉండటం మరో విశేషం. అయితే ఈ పులస చేప ధర వేలం పాటలో పాల్గొన్న వ్యక్తుల ఆధారంగా రేటు పెరుగుతుంది. సముద్రానికి దగ్గరగా ఉండే యానాం, కోనసీమ ప్రాంతాల్లో కిలో చేప రూ.25 వేలకు కూడా వెళ్తుంది. ప్రధానంగా అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా పులస చేపల వ్యాపారం చేస్తారు. ఇతడికి అనేకమంది నేతలు, ప్రముఖులు ముందే అడ్వాన్సులు ఇచ్చేసి చేప చేజిక్కించుకుంటారు. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా వశిష్ఠ గోదావరిలో మలికిపురం మండలం రామరాజులంక గంగపుత్రులకు వలలో కేజీన్నర చేపపడగా రూ.25వేల ధర పలికింది. తాజాగా జూలై 12న యానాం వద్ద కేజీన్నర చేప రూ.18 వేలు పలికింది. గోదావరిలో తీపి నీరు, సముద్రంలో ఉప్పునీరు కలవడంతో ఈ చేప శరీరతత్వం మారుతుంది. అందుకే అంత రుచి. సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురీదుకుంటూ వెళ్లడం వలనే పులసలకు అంత టేస్ట్. ఈ పులస చేపల్లో ఆడ, మగ చేపలుండగా, వీటిలో ఆడ చేపకు ధర ఎక్కువ. ఇక పులసను రకరకాలుగా వండి జిహ్వాచాపల్యం తీర్చుకుంటారు. కొందరు వంకాయ, బెండకాయ కలిపి వండుతారు.

అంతకంతకూ మాయం..

కొన్నేళ్లుగా గోదావరిలో పులస లభ్యత తగ్గిపోయింది. సముద్ర జలాలు కాలుష్యం కావడం, చమురు సంస్థల డ్రెడ్జింగ్ వల్ల అనేక చేపలు మరణిస్తున్నాయి. అటు సముద్రం, గోదావరి కలిసే మొగ ప్రాంతంలో ఇసుక మేటలు పేరుకుపోవడంతో పులస గోదావరిలోకి రావడం తగ్గిపోతోంది. అలాగే మత్స్యకారులు భారీ వలలతో వేటాడే సమయంలో తల్లి పులసలు చిక్కడంతో సంతానం తగ్గిపోతోంది. అందుకే వలకు గుడ్లతో ఉన్న తల్లి చేప కనిపిస్తే నదిలో వదిలేయాలని మత్స్యశాఖ ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. వాస్తవానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 2010కి ముందు సరాసరి సీజన్‌లో మూడు టన్నుల పులస చిక్కేది. కానీ ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు క్వింటాళ్లకు పడిపోయింది. వాస్తవానికి కోనసీమ జిల్లాలో యానాం వద్ద, రాజోలు మార్కెట్ పులసలకు పెట్టింది పేరు. కానీ ఎప్పుడోగానీ పులస జాడ ఉండడం లేదు. ఈ ఏడాది ఆరంభంలోనే పులస దొరకడంతో ఈ దఫా చేప లభ్యత పెరిగే అవకాశం ఉందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

విలసలకూ యమా డిమాండు

పిఠాపురం/మండపేట, జూలై19: కొంచెం అదే రుచి, అదే మాధుర్యం, పట్టిపట్టి చూస్తేనే కాని తెలుసుకోలేని వైరుధ్యం. అదే ఒడిశా పులస. గోదావరి పులసలను వేలల్లో పెట్టి కొనలేని వారు వీటిని కొని వండుకుంటారు. ఇప్పుడిప్పుడే విలసల విక్రయాలు మొదలయ్యాయి. ఒడిశా ప్రాంతంలో సముద్ర తీరప్రాంతాల్లో చెరువులు తవ్వి పెంచే పులస జాతి చేపలను ఒడిశా పులసలుగా, ఇలసలుగా పిలుస్తారు. కొందరు సముద్రంలో దొరికే విలసలనూ విక్రయిస్తారు. గోదావరి పులస రూ.5 వేల నుంచి పాతిక వేలు ఉంటే, ఒడిశా పులస మాత్రం సైజును బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకూ మాత్రమే ఉంటుంది. కొందరు వీటినే పులసలుగా చెప్పి విక్రయించి మోసగిస్తారు. హోటళ్ల వారూ వీటినే పులసలుగా వండి వడ్డిస్తారు.



విలసల విక్రయం

రుణాల వసూలుకు నిర్దిష్ట లక్ష్యాలు

- నెలకు రూ.1.30కోట్ల రికవరీ
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి

కార్పొరేషన్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం లబ్ధిదారుల నుంచి రుణాల వసూలుకు నిర్దిష్ట లక్ష్యాలు ఏర్పాటు చేసి ప్రతినెలా రూ.1కోటి30లక్షలు రికవరీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఈ అంశంపై ప్రతివారం సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ కార్యదర్శి రుణ బకాయిలు వసూళ్ల గురించి సమీక్ష నిర్వహించనున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం విధించిన గడువు 60నెలలు పూర్తయింది. అందువల్ల లబ్ధిదారులు బకాయిలు చెల్లించి రుణ విముక్తి పత్రం పొందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి సూచించారు. బకాయిలను లబ్ధిదారుల నుంచి లేదా వారి హామీదారుల నుంచి వసూలు చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. లబ్ధిదారులు డీడీ రూపంలో కానీకార్యాలయపు బ్యాంకుఅకౌంట్‌క్యూఆర్ కోడ్ ద్వారా కానీ బకాయిలను జమ చేసి రశీదు పొందాలని ఈడీ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గతంలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ పథకాలద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు 2015-16 నుంచి 2018-19 వరకు రుణాలు పొందిన లబ్ధిదారులు, ఇంత వరకు సక్రమంగా ప్రభుత్వానికి తిరిగి జమచేయనుందున వారిద్వారా కట్టించేలా రంగం సిద్ధం చేశారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకంలో 114 ఇన్నోవా వాహనాలకుగాను రూ.9,56,59,791, 72ఇతియాస్ రవాణా వాహనాలకు రూ.3,50,51,624, 729 స్వయం ఉపాధి పథకం వాహనాలకుగాను రూ.10,97,03,304, ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ పథకంలో 3ఇన్నోవా వాహనాలకు రూ.42,86,254, 240 స్వయం ఉపాధి పథకం కింద వాహనాలకు రూ.6,90,03,216 బకాయిలు ఉన్నాయని ఈడీ సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక వనరులు పెంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ల సమీక్షలో ఆర్డీ నాగనరసింహారావు

సామర్లకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆదాయ వనరులు పెంచుకోవడం తోపాటు ప్రజల దైనందిన సమస్యలైన పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీరు వంటి కనీస సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్లు పూర్తి శ్రద్ధ వహించాలని మున్సిపల్ ప్రాంతీయ సంచాలకులు నాగనరసింహారావు అన్నారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం సమావేశపు హాలులో జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీ నాగనరసింహారావు సామర్లకోట, పిఠాపురం, ఏలేశ్వరం, తుని, పెద్దాపురం తదితర మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి డయల్ యువర్ కమిషనర్ పేరిట ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఆదాయ వనరుల సమీకరణలో భాగంగా అండర్ ఎసెస్‌మెంట్లు,ఎసెస్‌మెంట్లు, అనుమతులు పొందిన ప్లాన్‌లకు మించి అదనపు అంతస్తులు నిర్మించిన భవనాలను గుర్తించి వాటిద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. ఖాళీస్థల పన్నులు, నీటి పన్నులు సత్వరం వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థికేతర సమస్యలను సత్వరం అదేరోజు పరిష్కరించాలని, ఆర్థిక పరమైన పనుల పరిష్కారాన్ని స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లు శ్రీవిద్య(సామర్లకోట), కనకారావు(పిఠాపురం), వెంకటరావు(తుని), శ్రీకాంత్‌రెడ్డి(పెద్దాపురం), సత్యనారాయణ(ఏలేశ్వరం) పాల్గొన్నారు.

ఎస్‌బీ డీఎస్పీగా సత్యనారాయణ



కాకినాడ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా కేవీ సత్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఎస్ఐగా పిఠాపురం, రాజమహేంద్రవరం, అడ్డతీగల పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. సీఐగా అనపర్తి, జగ్గంపేట, కైకలూరు, నూజివీడు సర్కిళ్లలో పనిచేశారు. అనంతరం డీఎస్పీగా పదోన్నతి పొంది కాకినాడ ట్రాఫిక్, ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా, పరవాడ ఎస్‌డీపీవోగా అనంతరం రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం కాకినాడ ఎస్‌బీ డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

వానజాన ఆడింది వయ్యారంగా..

- ఎట్టకేలకు చిందేసిన చినుకమ్మ..
- కాకినాడ జిల్లాలో భారీ వర్షం
- జూలై నెలలో ఇదే తొలకరి పలకరింపు



కాకినాడలో కురుస్తున్న వాన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చినుకు చిందేసింది.. కారుమబ్బులను చీల్చుకుంటూ కదలివచ్చింది. చిటపటలాడుతూ కురుస్తూ భానుగుడి భగభగలను చినుకమ్మ చల్లార్చింది. కాకినాడ జిల్లాలో వానజాన ఉరుములు, మెరుపులతో వయ్యారంగా ఆడింది. శనివారం మధ్యాహ్నం నుంచి నేనొచ్చేశాను అంటూ పలకరించింది. గత కొన్ని రోజులుగా మబ్బుల మాటున ముఖం చాటేసిన వానమ్మ రాకతో జిల్లావాసులు కాస్త ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందారు. చల్లని సాయంత్రం వేళ సేదతీరారు. అల్పపీడన ప్రభావంతో మరో నాలుగు రోజుల పాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన సూచనలను నిజంచేస్తూ భారీ వర్షం కురవడంతో అటు రైతుల ముఖాల్లోనూ ఆశలు చిగురించాయి. వాస్తవానికి జూలై మాసం వచ్చిందంటే చాలు.. నైరుతి రుతుపవనాల రాక మొదలవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. వర్షాలు విపరీతంగా కురుస్తాయి. ఈసారి వర్షాల జాడ చినుకంత మాత్రం కూడా కనిపించలేదు. రోహిణి కార్తెను తలపించేలా ఎండలు మండిపడ్డాయి.

బాబోయ్ భానుడు

రోహిణి కార్తె వెళ్లిపోయింది. వేసవికాలం ముగిసింది. వర్షాలు దండిగా కురవాల్సిన సమయం.. కానీ భానుడి భగభగలు తగ్గకపోగా మరింత పెరిగాయి. ఈసారి నైరుతి ముందుగానే పలకరించినా జూలైలో ముఖం చాటేయడంతో ఎండలు ముదిరిపోయాయి. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో ఈ ఏడాది ముందుగానే వడగాడ్పుల తీవ్రత తగ్గి వేసవి ముందుగానే పూర్తయినా.. 'సమ్మర్ 2.0' అన్నట్టుగా ప్రస్తుతం వాతావరణం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా జూలైలో గరిష్టస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పొడిగాలుల కారణంగా వర్షాకాలంలోనూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. గురు, శుక్రవారాల్లో జిల్లాలో సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల అదనంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాస్తవానికి ఈనెల 15వ తేదీ సాయంత్రం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినా.. పరిస్థితి మాత్రం వేడిగానే ఉంది. చినుకు జాడ కానరాలేదు. సాయంత్రం ఆరు గంటలు దాటినా భానుడి ప్రతాపం కొనసాగుతూ వచ్చింది. బయటకు వెళ్లాలంటేనే జనం బెంబేలెత్తిపోవాల్సినంతగా వాతావరణం వేడెక్కింది. ఆకాశంతా మబ్బులతో.. ఉరుములు, పిడుగులతో నేలంతా తడిచేలా వానలు కురవాల్సిన జూలైలో ఎండలు మండిపోవడంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. రుతు పవనాలు ఎటుపోయాయోనని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. దీనికితోడు విపరీతమైన వేడిగాలులతో విద్యుత్ వినియోగమూ పెరిగింది. ముఖ్యంగా ప్రజలు ఈ వేడిగాలుల నుంచి ఉపశమనం కోసం ఏసీలను వినియోగిస్తుండడంతో విద్యుత్ వినియోగం వేసవిలో ఉన్నట్టే ఉంది. దీంతో లోడ్ అధికమై ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతున్నాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

శనివారం మధ్యాహ్నం నుంచి..

శనివారం ఉదయం మబ్బుగా వాతావరణం కనిపించినా.. షరా మామూలుగానే భానుడు తన ఉగ్రరూపాన్ని చూపాడు. మండే ఎండతో జనం ఆపసోపాలు పడ్డారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు వాతావరణం వేడిగానే ఉంది. మూడున్నర గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురుగాలులు వీచి పరిస్థితి చల్లబడింది. భారీవర్షం కురిసింది. ఏకధాటిగా సుమారు గంటకుపైగా కురిసిన వానతో కాకినాడ సిటీ, రూరల్‌లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలోని జగ్గంపేట, పిఠాపురం, పలు ప్రాంతాల్లోనూ శనివారం భారీగా వర్షం పడింది. భారీ వర్షంతో జిల్లా ప్రజలు కాస్త సేదతీరారు. నిప్పుల కుంపటిగా ఉండే వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు.

ఎస్పీ ఆధ్వర్యంలో 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర'



బీచ్ పరిసరాలను శుభ్రపరుస్తున్న ఎస్పీ బిందుమాధవ్ బృందం

కాకినాడక్రైం, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ బీచ్ పరిసరాలను శుభ్రపర్చారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లోను ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని వాటికి బదులుగా లోహపు, గాజుబాటిల్స్, కాగితపు ప్యాకింగ్, గుడ్డసంచులు వంటి పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించాలన్నారు. జిల్లావ్యాప్తంగా సబ్ డివిజన్‌ల పరిధిలోని అన్ని సర్కిల్‌లు, పోలీస్‌స్టేషన్‌ల్లో అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాల పరిసరాల్లో ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని సృష్టించే పనిలో నిమగ్నమయ్యారన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

తునిలో 'పోలవరం' పనులు పరిశీలన

తునిరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తునిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల్లో ప్యాకేజీ5లో భాగంగా తాండవ అక్విడెక్ట్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ పనులను జలవనరులశాఖ మంత్రి రామానాయుడు శనివారం పరిశీలించారు. అధికారులు,ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడి నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తిచేయాలన్నారు.

మాజీ మంత్రి ముద్రగడకు తీవ్ర అస్వస్థత

7

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

- 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్



ప్లాస్టిక్ వద్దంటూ మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, కలెక్టర్, ఎమ్మెల్సీ

కార్పొరేషన్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్య ప్రమాదంనుంచి సమాజాన్ని తప్పించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతతో కృషిచేయాలని కాకినాడ జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్ అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కాకినాడ ఆనంద భారతి గ్రౌండ్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండ్యన్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణ, ప్లాస్టిక్ పొల్యూషన్ కారణంగా జరిగే దుష్ప్రభావాలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పట్టణ మహిళలు వేసిన ముగ్గులను జిల్లాప్రత్యేకాధికారి పరిశీలించారు. వీరపాండ్యన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించడం ద్వారా ఎదురయ్యే పరిణామాలపై అవగాహన పెంపొందించుకుని ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజం తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం జిల్లా అంతటా స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు.నిత్యజీవితంలో మార్పులు చేసుకోవడం ద్వారా ప్లాస్టిక్ నిషేధం సంపూర్తిగా సాధించవచ్చన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులకు పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్, మెప్మా పీడీ బి.ప్రియంవద, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జె.నరసింహనాయక్, ఎంహెచ్‌వో డాక్టర్ కె.పృథ్వీచరణ్, సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ రజతోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం పడాల వీరభద్రరరావు స్మారక కళాప్రాంగణంలో స్వరాభిషేకం పేరిట జరిగిన సినీ సంగీత విభావరి అలరింపచేసింది. అనంతరం ఆంధ్రశ్రీ పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా అన్నంరాజు సీతాపతిరావుకు పురస్కారాన్ని అందజేశారు. రాత్రి నాటికల ప్రదర్శనలో భాగంగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్‌వారి 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక ప్రదర్శించారు. తల్లి ప్రాముఖ్యాన్ని వివరిస్తూ భగవంతుడైనా అమ్మ తరువాతేనని తెలియజేసేలా ప్రదర్శన సాగింది. అనంతరం భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారి 'దొందూ దొందే' నాటిక ప్రదర్శించగా అందరినీ ఆనందిపజేస్తూ ఆలోచించేలా కథనం, పాత్రల ప్రదర్శన జరిగాయి. కార్యక్రమంలో భాగంగా బి.వెంకన్నబాబు 'అశ్వత్థామ' ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కె.అచ్యుతరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, సభ్యులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



కాకినాడలో శనివారం రాత్రి ప్రదర్శించిన నాటికల్లోని సన్నివేశ దృశ్యాలు

గోవిందా..ఈ జర్నీ సరైందా?





రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వెళ్లే భక్తులు ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సి వస్తోంది. వాడపల్లికి చేరేందుకు రైలు మార్గాన రాజమండ్రికి చేరుకుంటున్న భక్తులు రైల్వే స్టేషన్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆలయానికి పయనమవుతున్నారు. శుక్రవారం రాత్రి వాడపల్లి వెళ్లిపోతే శనివారం ఉదయానికి దర్శనం అవుతుందని శుక్రవారం రాత్రి రైల్వే స్టేషనుకు చేరుకునే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే రాజమండ్రి నుంచి వాడపల్లి వెళ్లేందుకు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీ 5 సర్వీసులను మాత్రమే నడుపుతోంది. దీంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ఆటోలో 12 నుంచి 15 మందిని ఎక్కించుకుంటున్నారు. కాలు కూడా కదపకుండా రాత్రి వేళ సుమారు గంటన్నర ప్రయాణించాల్సి వస్తోంది. ఏదైనా దుర్ఘటన జరిగిన తర్వాత పరుగుల కంటే ముందస్తుగా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తే మంచిది అని పలువురు గుర్తు చేస్తున్నారు.

క్షణాల్లో ఘోరం.. విషాదం

- ఆటోను ఢీకొన్న మోటారు సైకిల్
- తెగిపడిన మహిళ తల
- యువకుడు మృతి
- కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లక్ష్మీదేవిలంక సమీపంలో ఘటన

ఓ రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మహిళ తల తెగి పడిన వైనం వెన్నులో వణుకు పుట్టించింది. క్షణాల్లోనే మహిళ, యువకుడి ప్రాణాలను హరించివేసింది. అసలు ఏం జరిగిందంటే..



సంఘటనా స్థలంలో బైక్, పరిశీలిస్తున్న పోలీసులు



ముమ్మిడివరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ లక్ష్మీదేవిలంక సమీపంలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు జై బుద్ధనగర్‌కు చెందిన పచ్చిమాల లక్ష్మి (49) ముమ్మిడివరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించి ఇంటికి వెళ్లేందుకు ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో ఆటో ఎక్కింది. ఆటోలో మహిళతో పాటు వృద్ధుడు, మరో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. ఆటో మురమళ్ల వైపు బయలుదేరింది. ఇంతలో ఆటో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా లక్ష్మీదేవిలంక సమీపంలో యానాం వైపు నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న బొడ్డు రాంబాబు (24) ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మి రోడ్డుపై పడింది. ఆటో వెనుక వస్తున్న ధాన్యం లోడు ట్రాక్టరు ఆమె మెడ భాగం పై నుంచి వెళ్లడంతో తల భాగం తెగి 3 మీటర్ల దూరంలో పడగా శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. రాంబాబు తీవ్రంగా గాయపడగా హైవే వాహనంపై అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ఉన్న వృద్ధుడు కూడా స్వల్పంగా గాయపడ్డాడు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా పచ్చిమాల లక్ష్మికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దిరుసుమర్రు శివారు పల్లిపాలేనికి చెందిన బొడ్డు రాంబాబు యానాం ప్రైవేటు ట్రావెల్స్‌లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం యానాంలో విధులు ముగించుకుని తిరిగి మోటారుసైకిల్‌పై వస్తుండగా ఈ ప్రమాదంలో కన్నుమూశాడు. ఇద్దరు మరణించడంతో వారి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

గంజాయితో నలుగురి యువకుల అరెస్ట్

మామిడికుదురు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా నగరంలో గ్రామంలో గంజాయితో నలుగురు యువకులను శనివారం నగరం పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు సమాధుల వద్ద యానానికి చెందిన గణపతి వెంకటదుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజు, నాగుల్లంకకు చెందిన యన్నాబత్తుల వెంకట్, మొగులికుదురు గ్రామానికి చెందిన పెమ్మాడి నాగూర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ పేర్కొన్నారు. నిందితులను రాజోలు కోర్టులో రిమాండ్ కోసం హాజరుపరిచామని తెలిపారు.

చింతూరులో ముగ్గురు..

చింతూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు శనివారం 5 కిలోల గంజాయితో ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు ఒడిస్సాలో 5 కిలోల గంజాయి కొనుగోలు చేసి వయా చింతూరు మీదుగా తెలంగాణకు తరలిస్తూ వాహన తనఖీల్లో పట్టుపడ్డారని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. రామవరానికి చెందిన మాలోత్ సాయినాధ్, తుంగారానికి చెందిన నోముల కృష్ణ, వేల్పుల రామును అదుపులోకి తీసుకుని ద్విచక్ర వాహనం, 4 ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బాలికపై అత్యాచారం

ఉప్పలగుప్తం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక బాలుడు అత్యాచారం చేసినట్టు బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కె ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సీహెచ్.రాజేష్ విచారణ చేపట్టారు.

మహిళ అదృశ్యంపై కేసు

తొండంగి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యులు రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ.కొత్తపల్లికి చెందిన వీర్ల సుబ్బలక్ష్మి (60) హైదరాబాద్ మల్కాజ్‌గిరి నందు సుమారు 15 ఏళ్లుగా పని చేస్తోంది. ఈ నెల 13న మల్లవరంలో బంధువుల ఇంట జరిగిన వేడుకకు వచ్చింది. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ఈనెల 14న అన్నవరం రైల్వేస్టేషన్‌లో కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆమె సోదరుడు అక్కిరెడ్డి అప్పారావు ఎక్కించాడు. మరుసటి రోజు ఆమెకు ఫోను చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త వీర్ల రాజోలు శనివారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చి...
గోదావరిలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు



పడవపై గాలింపు చేపడుతున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం



దినేష్ (ఫైల్)

ఆత్రేయపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి గోదావరిలో గల్లంతయ్యాడు. తెలంగాణ రాష్ట్ర ఖమ్మం జిల్లా వెనుసూరి మండలం లచ్చన్నగూడెంకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్ (22) ఆరుగురు మిత్రులతో కలిసి సత్తుపల్లి నుంచి కారులో శుక్రవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం వాడపల్లి వెంకన్న సన్నిధికి బయలుదేరారు. శనివారం వాడపల్లికి చేరుకున్న వారు తెల్లవారుజామున 5 గంటలకు ఆలయంలోకి సమీపంలో ఉన్న గోదావరి నదిలో స్నానానికి దిగారు. అక్కడే ఉన్న పడవపై ఎక్కి కేరింతలు కొట్టారు. దినేష్‌కు ఈత రాకపోవడంతో అక్కడిక్కడే మునిగి గల్లంతయ్యాడు. మిత్రులతో పాటు స్థానికులు దినేష్‌ను కాపాడే ప్రయత్నంచేశారు. ఈ విషయాన్ని ఆలయ సమాచార కేంద్రం వద్దకు తెలియచేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వారందరూ ఘటన స్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం 16వ బెటాలియన్ ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది గల్లంతైన దినేష్ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, మిత్రులు వాడపల్లి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అక్కడికి చేరుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దినేష్ సోదరుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

తారాస్థాయికి పెద్దింట్లమ్మ ఆలయ వివాదం

పోలీసుల అదుపులో ఎన్నారై



వెంకటపతిరాజాను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అంతర్వేది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం మెండుపాలెం (చిన్నకొల్లేరు) గ్రామంలో శ్రీపెద్దింట్లమ్మ ఆలయం వివాదం తారాస్థాయికి చేరింది. అమ్మవారి ధూపదీప నైవేద్యాలు, ఉత్సవాలు గ్రామస్తులతో నిర్వహించబడేవి. ఇటీవల గ్రామస్తులు 2 వర్గాలుగా మారడంతో ఉత్సవాలు వివాదానికి దారి తీశాయి. వెంటనే ఆర్డీవో, డీఎస్పీ, స్థానిక ఎస్ఐ సమక్షంలో వారికి సర్దిచెప్పినా వినిపించుకోలేదు. ఆలయాన్ని 7 నెలల క్రితం దేవదాయశాఖకు అప్పగించి వార్షికంగా వచ్చే జాతర మహోత్సవాలు నిర్వహించారు. ప్రస్తుతం ఎండోమెంట్ ఆర్డరును రద్దు చేసి మళ్లీ సింగిల్ కమిటీని నియమించి ఒక వర్గం వారికి అప్పగించారు. రెండో వర్గంవారు వచ్చి పోలీసులను అడగ్గా ఆర్డరు కాపీ ఉన్నదని చెప్పి వారు చూపించకపోవడంతో ఇరు వర్గీయుల మధ్య వివాదం జరిగేలా ఉందని 50మంది పోలీసు సిబ్బందితో వారికి శనివారం ఉదయం సర్ది చెప్పారు. ఆలయ ఆవరణలో చండీహోమం, శాంతిహోమం, అన్నదానం నిర్వహించేందుకు, ఆలయాన్ని శుద్ధి పరిచేందుకు ఒక వర్గానికి చెందినవారు రావడంతో పోలీసులు ఆలయం వద్ద మోహరించారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమాలకు పోలీసులు అనుమతులు నిరాకరించడంతో శనివారం మధ్యాహ్నం పోలీసుస్టేషన్‌లో ఎన్నారై యెనుముల వెంకటపతిరాజాతో కలిసి ఒక వర్గం వర్గీయులు పోలీసుస్టేషన్ ముందు బైఠాయించారు. నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటపతిరాజా, వర్గీయులు, పోలీసులకు తోపులాట జరిగింది. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని వెంకటపతిరాజా, 21 మంది యువకులు, మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు వాహనాల్లో వేరే ప్రదేశాలకు తరలించారు.

ఆదాయ వనరుల లక్ష్యాల సాధనకు ప్రణాళికలు

మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు

సామర్లకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలలో ఆదాయ వనరుల వసూళ్ల లక్ష్యాలను సాధించేందుకు సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు వెల్లడించారు. శనివారం కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆర్డీ మాట్లాడుతూ తన రీజియన్ పరిధిలో 7 జిల్లాలకు చెంది 34 మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు ఉన్నాయని ప్రతీనెలా ఆయా మున్సిపాల్టీల్లో అధికారుల పనితీరుపై సమీక్షిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించడం జరుగుతుందన్నారు. గతంలో ప్లాన్ అనుమతులు పొంది నిర్మించిన భవనాలు తదనంతరం మరిన్ని అంతస్తులు నిర్మించడం లేదా భవన విస్తీర్ణాన్ని పెంచడం వంటి పనులకు చెంది టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి పన్నులు పెంపుదల చేపట్టానున్నారు. ట్రేడ్‌లైసెన్స్ రుసుములు వసూళ్ళు, అడ్వర్‌టైజ్ మెంట్ హోర్డింగ్స్‌పై పన్నులు సత్వరం వసూళ్ల నిర్వహించేందుకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నామన్నారు.

'న్యాయ సలహా అనంతరం చర్యలు తీసుకుంటాం'

అన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో కార్మికులకు ఈపీఎఫ్ మొత్తం చెల్లించకుండా నకిలీ రశీదులతో అధికారులను బురిడీ కొట్టించిన వ్యవహారంపై న్యాయసలహా కోరి తదుపరి చర్యలు తీసుకుంటామని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. శనివారం అన్నవరం సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన పీఎఫ్ అధికారులతో ఈవిషయంపై చర్చించారు. దీనికి సంబంధించి చర్యలపై ఏవిధంగా ముందుకెళ్లాలని కోరగా రాజమండ్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని అనంతరం న్యాయసలహాతో సంబంధిత కాంట్రాక్టర్‌పై ఏ చర్యలు తీసుకోవాలో మంగళవారం నిర్ణయం వెలువడుతుందన్నారు.

డ్వాక్రా యానిమేటర్ అరెస్ట్

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సొమ్ములు కాజేసిన యానిమేటర్‌ను శనివారం కిర్లంపూడి పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన దుర్గ డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తు 42 డ్వాక్రా గ్రూపులకు ఇన్‌చార్జిగా ఉంది. బూరుగుపూడిలో 12 గ్రూపులకు 2023లో స్త్రీనిధి ద్వారా లోను ఇప్పించి 8 గ్రూపు సభ్యులకు వేరే డబ్బులు మీ ఖాతాలో పడ్డాయని చెప్పి వారి సంతకాలు, వేలిముద్రలు తీసుకుని వారి వద్ద రూ.20.25లక్షలు కాజేసి గ్రామం వదిలి పారిపోయింది. దీనిపై మే 24న కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది దర్యాప్తు చేసి నిందితురాలు దుర్గను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచారు. ఆమెకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

ముద్రగడకు తీవ్ర అస్వస్థత

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 2రోజుల క్రితం కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. షుగర్ లెవల్స్ పడిపోవడంతో శనివారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారని సమాచారం. దీంతో ముద్రగడను కాకినాడ మెడికోవర్ ఆస్పత్రికి తరలించాలన్న వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు అక్కడ చేర్పించినట్టు తెలిసింది. అవసరమైతే అర్ధరాత్రి హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉందని తెలిసింది.


గైట్ అటానమస్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



వేదికపై ముఖ్యఅతిథితో పాటు జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీజీయూ ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకలు శనివారం జరిగాయి. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)పూర్వ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య జయంత్ ఎం.మోదక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మన దేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు 25కోట్ల మంది విద్యను కొనసా గిస్తున్నా హైస్కూల్ అనంతరం 66శాతం మంది మాత్రమే విద్య ను కొనసాగిస్తున్నారన్నారు. ఉన్నత విద్యను పూర్తి చేసే వారు 25శాతం మాత్రమే ఉన్నారన్నా రు.ఈ సంఖ్యను జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం 50శాతానికి పెంచే లక్ష్యంతో ముందు కెళ్తున్నామన్నారు. సమగ్రత, సహకారం, విచరణాత్మకత, బాధ్యత, సృజనాత్మక త అనే ఐదు భవిష్యత్ విజయానికి మూల స్తంభాలన్నారు. మరో ముఖ్యఅతిథి జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జీజీయూ ప్రోఛాన్సలర్ కె.శశికి రణ్ వర్మ, ఉపకులపతి యు. చంద్రశేఖర్, ప్రో వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎం ఎస్ శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణమూర్తులు



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకస్వామి

ద్రాక్షారామ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో భీమేశ్వరాలయ బాహ్యాప్రాంగణంలో ప్రసన్నాంజేయస్వామి సన్నిధిలో భద్రాది సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది.ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న సప్తసప్తాహం ముగింపు సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని వందలాది మంది భక్తులు తన్మయత్వంతో తిలకించారు. ఉదయం రథమూ ర్తులను కల్యాణ వేదికపై అధిష్టించారు. అనంత రం గణపతి పూజ, కంకణ, యజ్ఞోపవీత ధారణ తదుపరి సుమూహూర్తం జరిపారు. మాంగల్యధారణ అనంతరం తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించారు. భద్రాది ఆలయ ఉప ప్రధానార్చకుడు ఎ.వెంకట శ్రీ నివాస రామానుజాచార్య ఆధ్వర్యం లో వేదపండితులు స్వామి కల్యాణాన్ని వేద మంత్రాలతో జరిపించా రు. సీతారామస్వామికి భీమేశ్వరాలయ సహాయ కమీషనరు ఏవీ దు ర్గాభవానీ పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.కార్యక్రమంలో భద్రాది ఆలయ ఈవో ర మాదేవి, మంచం చినబాబు దంపతులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో బాలభక్త సమా జం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీఎస్ఐడీసీ నుంచి మరో మూడు ఎత్తిపోతలు

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యో తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లాలో మరో మూడు ఎత్తిపోతల పథకా లు నిర్మించనున్నారు. బీఆర్ అంబేద్కర్ కోనసీ మ జిల్లా అప్పన్నపల్లిలో రూ.60 కోట్లతో 4045 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా పథకాన్ని ని ర్మించనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం తిమ్మాపురంలో రూ.70 కోట్లతో 7,800 ఎకరాల ఆయకట్టుకు నీరందించే ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఏలేరు రిజర్వాయరు నుంచి మొల్లేరు, మల్లవరం, గోవిందపురం గ్రామాల పరిధిలో 9,000 ఎకరాల ఆయకట్టు కోసం మొల్లేరు ఎత్తిపోతల నిర్మిస్తున్నారు. ఇది గోకవరం మండలంలో కొంత, కాకినాడ జిల్లాలో కొంత, ఏజెన్సీ ప్రాంతంలో కొంత మేర విస్తరిం చి ఉంది. దీనికి ఇప్పటికే రూ.136కోట్లు రాగా, రూ.10 కోట్లు ఖర్చు చేశారు. కానీ ధరలు పెరగ డం వల్ల తమకు గిట్టుబాటు కావడంలేదని, కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్ పని ఆపే శాడు. కానీ ఇటీవల కేబినెట్‌లో ఈ పథకాన్ని నిర్మించడానికి ఆమోదించారు. ఈ విషయాన్ని డీఈ పి.దుర్గాగురవయ్య తెలిపారు.

ముగిసిన ఏపీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

- కాకినాడలో రెండు సహాయ కేంద్రాలు
- ఆన్‌లైన్‌లో మొత్తం 5,590 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- ఈనెల 22న సీట్ల కేటాయింపు

జేఎన్టీయూకే, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌కౌన్సెలింగ్ ఈనెల 7 ప్రారంభమైంది. 16వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ జరుగ్గా, ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్‌లో 17వరకూ కొనసాగింది. ఈఏపీసెట్ షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో విద్యార్థుల వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగియగా శనివారం విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను మార్పుచేసుకున్నారు.

●ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాధపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల సహాయకేంద్రంలో వారికి కేటాయించిన 1439 మంది విద్యార్థుల ధ్రువపత్రాలకుగాను 1434 మంది ధ్రువపత్రాలను, కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకేలో గల సహాయ కేంద్రంలో వారికి కేటాయించిన 4167 మంది విద్యార్థుల ధ్రువపత్రాలకుగాను 4156 మంది ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు.

మిగతా షెడ్యూల్ ఇదే...

● సీట్ల కేటాయింపు జూలై 22న జరుగుతుంది. ఈనెల 23నుంచి 26వరకూ ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలి. ఆగస్టు 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

రూ. 66.27 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. మం డుటెండలో గంటల తరబడి అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకన్నారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శాసనమండలి సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు దంపతులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ సేవల ద్వారా శనివారం స్వామివారికి రూ.66,27,595లు ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

సామాజిక సేవకుడు ఆంజనేయరెడ్డికి ఆంధ్రశ్రీ బిరుదు

సర్పవరంజంక్షన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్న సామాజిక సేవకుడు, నంది అవార్డు గ్రహీత అనపాల ఆంజనేయరెడ్డికి ఆంధ్రశ్రీ బిరుదును పాన్ ఇండియా సోషియా కల్చర్ అసోసియేషన్ ప్రకటించింది. ఈమేరకు శనివారం విజయవాడ ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో పాన్ ఇండియా సోషియాకల్చర్ అసోసి యేషన్ వ్యవస్థాపకుడు అద్ధంకి రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి కీర్తి పురస్కార అవార్డుల ప్రధానోత్సవంలో అనపాల ఆంజనేయరెడ్డిని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఘనంగా సత్కరించి, ఆంధ్రశ్రీ బిరుదు అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రయా ణికుల దాహార్తిని తీర్చడమే కాకుండా ఇరవై ఐదేళ్లుగా చలివేంద్రం నిర్వహిస్తున్న ఆంజనేయ రెడ్డిని అభినందించారు. వివిధరంగాల్లో సేవలు అం దించిన వారిని గుర్తించి, పలుఅవార్డులతో ప్రో త్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.



ఆంజనేయరెడ్డిని సత్కరిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి : ఎంపీ

కలెక్టరేట్(కాకినాడ), జూలై19(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుం దని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తొండంగి మండలంలో మత్స్యకార గ్రామమైన ఎల్లయ్యపేటలో సామాజిక భవనానికి ఎంపీ లాడ్స్ నిధులు రూ.40 లక్షలు కేటాయించామన్నారు. ఈనేపథ్యంలో మత్స్యకార నాయకులు తనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు.


కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న డీఆర్వో వెంకట్రావు



స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ ర్యాలీలో పాల్గొన్న డీపీవో రవికుమార్


ఎమ్మెల్సీ పద్మశ్రీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న దృశ్యం



వర్సిటీ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

విజయవంతంగా స్వర్ణాంధ్ర

● కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేసిన అధికారులు ● స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రతిజ్ఞ

కలెక్టరేట్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి):ప్రతినెలా మూడో శనివారం నిర్వహి స్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో విజయవంతంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఉద్యోగులు దీనిలో పాలు పంచుకున్నారు. కలెక్టరేట్‌లో పరిసరాలను శుభ్రంచేసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేం దుకు తమ వంతు కృషి చేస్తామంటూ మానవహారం నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అందరితో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సీపీవో త్రినాథ్, వికాస పీడీ లచ్చారావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ రావు, కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధిపతులు, పౌరసరఫరాలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చీడిగలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ ర్యాలీ

కాకినాడ రూరల్: రూరల్ మండలం చీడిగలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈవో బొబ్బిలి గోవిందరాజులు ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్‌ని నిషేదిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో పంచాయతీరాజ్ ప్రభుత్వాధికారులు, సచివాలయ సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పంచాయితీ అధికారి వి.రవికుమార్, డీఎల్‌డీవో వాసుదేవ రావు, ఎంపీడీవో పి.సతీష్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీరామాంజనేయులు పాల్గొన్నారు. ఈసందర్బంగా డీపీవో మాట్లాడుతూ చీడిగలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిస్తూ గ్రామపంచాయతీలో తీర్మానించామని, ఎవరైనా అనిబంధనను అతి క్రమిస్తే అటువంటి వారిపై జరిమానా విధిస్తామన్నారు. అధికారులు, సిబ్బందితో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఎల్‌డీవో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతీ గ్రామపంచాయతీలోనూ అమలుచేయనున్నామన్నారు. ఎంపీడీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేయుటపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మహేష్‌కుమార్, గీసాల శ్రీనివాసరావు, రామకృష్ణ గ్రామ ఆరోగ్య, సచివాలయ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు,

ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం అంటూ ర్యాలీ

పిఠాపురం: ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం నినాదంతో పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కమిటీ, ఎకోక్లబ్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి పురవీధులు మీదుగాప్రదర్శన జరిపారు. ప్లాస్టిక్ సీసాలు, కవర్లతో ఆకర్షణీయమైన గృహోపకరణాలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, కమిటీ కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్, ఆనంద్, ఆలీబాబా, కామేశ్వరరావు, మాధవి, అనంతలక్ష్మి, శ్రీనివాస రావు, ఆంజనేయులు, పల్లవి, పద్మావతి, వీర బాబు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

సర్పవరంజంక్షన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌లో భాగంగా శనివారం రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీసత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ అసోసియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కోరుమిల్లి బాబ్రసాద్ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. మొక్కలు నాటారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ సీహెచ్ గణపతి, ఏపీఐఐసీ డిప్యూటీ మేనేజర్ పద్మజాదేవి, క్లస్టర్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జీవీఆర్‌మూర్తి, డైరెక్టర్లు కాల ఉదయ ప్రకాశ్, కె జానకీరామ్, ఈటకోట ప్రసాద్ పాల్గొన్నారు. తిమ్మాపురం అక్కూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ ఎస్. ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలనపై స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ కాలుష్య నివారణపై ర్యాలీ

జేఎన్టీయూకే: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జేఎన్టీయూకే, యూసీఈకేలలో శనివారం ప్లాస్టిక్ కాలుష్య నివారణపై ర్యాలీని ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విద్యార్థుల వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ ఏ.కృష్ణమోహన్, అతిథులుగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీఎస్ఆర్ దీక్షితులు, వర్శిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికార్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దాపురం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన శనివారం పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ జంక్షన్‌వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతీరాణి, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగ నాగ్ కూటమినేతలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం తప్పనిసరి

సామర్లకోట: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం అమలుకు ప్రతీఒక్కరూ సహకరించాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో ప్రతీ మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ పేరిట శనివారం సామర్లకోట గడియారస్తంభం ఎదుట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌పై నిషేధం అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, కురుకూరి సోమేశ్వరరావు, జనసేన నాయకులు సరోజా వాసు, అత్తిలి కృష్ణ, పెంకే వెంకటలక్ష్మి, మెప్మా సీఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని అంతమొందించాలి

కరప: పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని కలిసికట్టుగా అంతమొందించాలని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కరప పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ ఫ్రీ నినాదంతో ప్రతిజ్ఞ చేసి ప్రధానరహదారి మీదుగా బజారు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి యు.నిర్మలాకుమారి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

ఆర్ఎంసీలో...

జీజీహెచ్(కాకినాడ) జూలై 19 (ఆంధ్రజ్యోతి) స్వర్ణఆంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్ఎంసీ ప్రాంగణాన్ని శుభ్రపర్చి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ ముఖర్జీ, వైద్యులు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థం: డీఎంహెచ్‌వో

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి దీర్ఘకాల అనర్థమని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో డాక్టర్ నాయక్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిఐఓ డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ ఐ ప్రభాకర్, డాక్టర్ వి అరుణ, డాక్టర్ జి లక్ష్మి, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి రద్దీ



పెద్దాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రూ.2,50,679 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

మరిడమ్మకు వెండి వస్తువుల బహూకరణ


అమ్మవారికి సమర్పించిన వెండి కంఠాభరణం, వెండి కుందులు

పెద్దాపురం, జూ లై19(ఆంధ్రజ్యోతి) : మరిడమ్మకు ఇరువురు దాతలు వెండి వస్తువులను బహూకరించినట్లు దేవస్థానం సహాయ కమి షనర్ కురం విజయ లక్ష్మి తెలిపారు. సామర్లకోట పట్టణానికి చెందిన చింతపల్లి సుబ్బారావు, రాధ దంపతులు 2.5 కేజీల వెండి కంఠాభరణం, పెద్దాపురం పట్టణానికి చెందిన లంకాడి రాంబాబు, కాంతం దం పతులు 600 గ్రాముల వెండి కుందులు బహూకరించినట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు 18 మందితో కూడిన జిల్లా కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గుటూరి పద్మ, యేడిద కృష్ణ, రవణం సుబ్రహ్మణ్యం, పెండెం శ్రీదేవి, తేజోమూర్తుల ఉషారాణి, వెలుగుల గోపాలకృష్ణ, ముసలగంటి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా చోడిశెట్టి రమేష్‌బాబు, వర్మ, కుండ సాయికుమార్‌యాదవ్, జిల్లా కార్యదర్శులుగా జ్యోతుల రాజేష్, కోన వెంకటసురేష్, బి.ధనలక్ష్మి, మేడ విజయలక్ష్మి, చెన్నయ్య దొర, గుడాల ప్రతాప్, రెడ్డి వరలక్ష్మి, కోశాధికారిగా పైడా రవీంద్ర, సోషల్ మీడియా ప్రతినిధిగా గౌతు చెన్నారావు, ఐటీ సెల్ పుట్రాజ్‌మాలి ను నియమిస్తూ కార్యవర్గాన్ని ప్రకటించారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఫిజిక్స్ సబ్జెక్ట్‌ను బోధించేందుకు రెండునెలలపాటు పనిచేసేందుకు అధ్యాపకుడి పోస్టుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీలో 50శాతం మార్కులు ఉండాలి. ఎంపికైన అధ్యాపకుడికి నెలకు రూ.27,000లు జీతం చెల్లిస్తారు. ఆశక్తి గల అభ్యర్థులు ఈనెల 23వ తేదీ ఉదయం 11గంటలకు ఒరిజనల్ సర్టిఫికేట్లతో తాళ్లరేవు కళాశాలలో హాజరుకావాలని కోరారు.

రేపు వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న కాకినాడ వికాసలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో స్టోర్, అసిస్టెంట్ మేనేజర్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, రైటర్, పర్సనల్ సెక్రటరీ, రిసెప్షనిస్ట్, ఆడిట్ అసిస్టెంట్, టెక్నీషియన్, టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, సీఏ, ఇంటర్, బీటెక్, ఎంకామ్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.23 వేల వరకు జీతం, ఇన్సింటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ 77993 76222లో సంప్రదించాలన్నారు.

రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ కార్యవర్గం ఎన్నిక

కార్పొరేషన్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ కాకినాడ గ్రీన్‌సిటీ 2024-25 అధ్యక్షుడు కందాల రవీంద్రనాద్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. అనంతరం 2025-26 రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ నూతన అధ్యక్షుడిగా జెట్టి పాండురంగారావు, జనరల్ సెక్రటరీగా ఎ.చినబాబు, ట్రెజరర్‌గా కేశ ఉమామహేశ్వరరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు భమిడిపాటి శ్రీకృష్ణ, సంజయ్, ఆకెళ్ల వీరభద్రప్రసాద్ ఉన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకు పాక దగ్ధం

పిఠాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ఇందిరానగర్‌లో శనివారం తెల్లవారుజాము సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకుల పాక దగ్ధమైంది. కొల్లు సత్యనారాయణకు చెందిన పాకలో జరిగిన ఈ ప్రమాదంలో నగదు, గృహోపకరణాలు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు వ్యాపించగానే నిద్రలోఉన్న సత్యనారాయణ కుటుంబ సభ్యులు భయంతో బయటకు వచ్చేశారు. వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కాగా అగ్నిప్రమాదంపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఎవరో కావాలని నిప్పు పెట్టి ఉంటారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. గ్రామానికి చెందిన సారిపల్లి నాగేశ్వరరావు(30) ఇంటిలో చెదకుగానూ మందు కొట్టేందుకు గడ్డి మందు తెచ్చి సీసాలో కలిపి కొంతభాగాన్ని కొట్టి మిగిలిన దానిని అక్కడ వదిలివేసి కూలీ పనికి వెళ్లాడు. ఈనెల 8వ తేదీ రాత్రి ఇంటికి తిరిగి వచ్చి మంచినీరు అనుకుని మందు కలిపిన నీటిని తాగడంతో వాంతులు అయ్యాయి. తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మరణించాడు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కల్తీ మద్యం తాగి మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

కాకినాడ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో కల్తీమద్యం తాగి 27 మంది మరణించారని, ఎటువంటి ఆధారంలేని వారి కుటుంబాలకు మానవతా దృక్పథంతో కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రాష్ట్ర కల్లు-మద్యం వినియోగాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు విజ్జి సత్యానందబాబా కోరారు.

నిలిచిపోయిన పూడికతీత పనులు

గొల్లప్రోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పీబీసీ కాలువలో చేపట్టిన గుర్రపుడెక్క, పూడికతీత పనులను అర్థాంతరంగా నిలిపివేశారని గొల్లప్రోలు ఆయ కట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు వారు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పూడికతీతను కేవలం ఒక రోజే చేసి మిగిలిన పనిని వదిలివేశారని తెలిపారు. తక్షణం పూర్తిస్థాయిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుపరిపాలనలో తొలి అడుగుకు స్పందన


36వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండబాబుకు మొక్క అందజేస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి స్థానిక 36వ డివిజన్‌లో విశేష స్పందన లభించింది. స్థానిక పార్టీ నాయకులతో కలిసి శనివారం డివిజన్‌లో పర్యటించిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. కొండబాబు డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్ర సన్న, క్లస్టర్ ఇన్‌చార్జి చింతా పేర్రాజు, స్థానిక నాయకులు ఆకెళ్ల ప్రసాద్, ఉప్పులూరి వీరభద్రరావు, నల్లూరి తులసి, చాట్ల వీరబాబు, చీకట్ల వాసు సత్యంశెట్టి రాజేష్, దారపు శ్రీను, పాపారెడ్డి, లంక వరప్రసాద్, కర్రి మహేష్, పొట్నూరి ధనలక్ష్మి, పెమ్మాడి సాయిప్రసన్న, ఆట్ల మధుశ్రీ., సరగడ గృహలక్ష్మి పాల్గొన్నారు.

కరప: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాకారమవుతోందని టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పేర్కొన్నారు. కరపమండలం ఉప్పలంక గ్రామంలో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఏడాది కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీచేశారు. టీడీపీ నాయకులు సంగాడి బాలమహేశ్వరరావు, బొమ్మిడి తాతారావు, జి.సత్తిబాబు, ఆర్.వీరబాబు, ఎస్.వీరబాబు, పి.దుర్గారావు, కె.శ్రీను, జె.మసేన్, కృష్ణ, సత్యం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తూందని టీడీపీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) తెలిపారు. శనివారం రమణయ్యపేట శివారు పాతగైగోలుపాడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పురస్కరించుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

'జాతి నిర్మాతలుగా న్యాయశాస్త్ర విద్యార్థులు ఎదగాలి'

సర్పవరం జంక్షన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :న్యాయశాస్త్రం విద్యనభ్యసించే నేటి తరం విద్యార్థులు భవిష్యత్ జాతి నిర్మాతలుగా పురోగమించాలని జేఎన్టీయూకే ప్రొఫెసర్, జనవిజ్ఞాన వేదిక సలహాదారు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ కోరారు. శనివారం రమణయ్యపేట రాజీవ్‌గాంధీ లాకళాశాల సెమినార్ హాల్లో యూనివర్శిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్, జన విజ్ఞాన వేదిక, రాజీవ్‌గాంధీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతి నిర్మాతలుగా న్యాయశాస్త్ర విద్యార్థులు అనే సదస్సులో ప్రసంగించారు. ప్రజాస్వామ్య సంస్థల పనితీరుని అధ్యయనం చేసి వాటిని మరింత బలోపేతం చేసేందుకు న్యాయశాస్త్ర విద్యార్థులు కృషి చేయాలన్నారు. యూడీ ఎఫ్ మెంటార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సామాజిక అంశాలను అధ్యయనం చేయడం ద్వారా నాయకత్వ లక్షాలను పెంచు కోవచ్చన్నారు. యుడీఎఫ్ చైర్మన్, జేవీవీ సలహా దారు ప్రొఫెసర్ జిఅబ్బ య్య, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ కొమ్మన తాతారావు, ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యమూర్తి, పి సుబ్బరాజు, పైడా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వంశీ, రాజీవ్‌గాంధీ కాలేజీ డైరెక్టర్ బలరాం, సంజయ్ కృష్ణయ్య తదితరులు సెమినార్‌లో ప్రసంగించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

మైత్రేయి దుర్గాభాయి దేశ్‌ముఖ్ అవార్డు అందజేత

కలెక్టరేట్(కాకినాడ), జూలై 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలో అన్నవరం సత్యదేవ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గృహ విజ్ఞాన శాస్త్ర అధ్యాపకులుగా, వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సువర్చలకు మైత్రేయి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును శనివారం అందజేశారు. మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ అనుబంధ సంస్థలు, రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈమెకు అవార్డు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ అనంతలక్ష్మి మాట్లాడుతూ అధ్యాపకులకు, విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ సువర్చలకు ఈ అవార్డు రావడం అభినందనీయమన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ఎంపీ సతీష్‌బాబు

సామర్లకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ నివాసి వాసంసెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యం పాలుకావడంతో సత్వరం ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమైంది. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు దృష్టికి వెళ్లడంతో సత్వరం స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించి సంబంధిత ఎల్‌వోసీ పత్రాన్ని శనివారం సామర్లకోట మండలం కొప్పవరం క్యాంపు కార్యాలయంలో బాధిత కుటంబసభ్యులకు అందజేశారు. దీంతో అవసరాన్ని వెంటనే గుర్తించిన ఎంపీ సతీష్‌బాబు అమరావతిలోని సీఎంవో కార్యాలయానికి తెలియజేసారు. దీంతో అదే రోజు రూ.5లక్షల సీఎంఆర్ఎఫ్ క్రెడిట్ లేఖ (ఎల్‌వోసీ)ను ఏర్పాటుచేసి బాధిత కుటుంబానికి శనివారం రాత్రి అందజేశారు.

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

● జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురం క్లాత్ అండ్ రడీమేడ్ వర్తక సంఘం సౌజన్యంతో పట్టణంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో 62మంది దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులకు ఆయన దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొజ్జా మాణిక్యాలరావు(అయలు), గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, నాయకులు చల్లా లక్ష్మి, సూర్యప్రకాష్, కొత్తెం సుందరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేసి మన్ననలు పొందాలి : ఎమ్మెల్యే నానాజీ


చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరప, వేములవాడ, కూరాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్‌పర్సన్‌లు, సభ్యుల ప్రమాణస్వీకారం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ ప్రమాణస్వీకార మహోత్సవాలకు కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే సహకార సంఘాల బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రైతుల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం ఆయా సంఘాల సీఈవోలు చైర్‌పర్సన్‌లు, సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. కరప పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సైనవరపు భవానీ శంకర్, సభ్యులుగా అడపా శ్రీనివాస్, చోడిశెట్టి సత్యనారాయణ, వేములవాడ పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా దూడల నారాయుడు, నక్కా సత్యనారాయణ, ఉలిసి వీర్రాజు, కూరాడ పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వెలుగుబంట్ల సూరిబాబు, సభ్యులు నున్న నాగేశ్వరరావు, రాపర్తి నూకరాజులు ప్రమాణ స్వీకారంచేశారు. ఎన్నికైన చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఎమ్మెల్యే, కూటమి నాయకులు, అభినందించారు. కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, కరప ఏఎం సీ చైర్మన్ ముద్రగడ రమేష్, డాక్టర్ బొం డా సూర్యారావు, చుండ్రు వెంకన్నరాయచౌదరి, దేవు వెంకన్న, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, బండే తాతా జీ, పాట్నీడి విష్ణు, కాకర్ల బుజ్జిబాబు, మద్దూరి స్వామి, యాళ్ల పండు, పితాని జయరాం, చాట్ర ఇమ్మానుయేల్, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, ఆయా సొసైటీల సీఈవోలు బి.పరశురామ్, నల్లా వెంకటేశ్వరరావు, చందు పాల్గొన్నారు.

రోప్‌వే బ్రిడ్జిపై రాకపోకలు నిలుపుదల

తాళ్లరేవు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాతకోరింగ గ్రామానికి వెళ్లే రోప్‌వే బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారడంతో ఆ బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేయాలని ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం కోరారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పొన్నమండ రామలక్ష్మి, టీడీపీ నేత వాడ్రేవు వీరబాబుల బృందం రోప్‌వే బ్రిడ్జిని పరిశీలించింది. అనంతరం పాతకోరింగ దుర్గమ్మగుడి వద్ద సర్పంచ్ పెయ్యల మంగేష్ ఆధ్వర్యం లో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ ఈఈ ఆదేశాలమేరకు రోప్‌వే వంతెన మరమ్మతుల కారణంగా వంతెనపై రాకపోకలను నిలిపివేయాలని ఆదేశించినట్లు పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు.

పంట కాలువలోకి తోడుతున్న గోదావరి జలాలు

తాళ్లరేవు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట సాగుకు పోలేకుర్రు, కోరింగ, నీలపల్లి, పి.మల్లవరం ప్రాంతాల్లో సాగునీరు కొరత ఉండటంతో జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరి నీరును మల్లవుకోట లాకు వద్ద పంటకాలువలోకి మోటార్లు ద్వారా మూడురోజులుగా తోడుతున్నారు. శనివారం ఇరిగేషన్ ఏఈ అనూష, అల్లూరి రామకృష్ణంరాజు పరిస్థితిని పరిశీలించారు. ఏఈ అనూష మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఇబ్బందులు రాకుండా వంతులవారీ విధానాన్ని అమలుచేయాలని ఆదేశించారు.

అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు : ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం 58 రోజులపాటు ఆమరణ దీక్ష చేపట్టి అశువులు బాసిన అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారకంగా అమరావతిలో 58అడుగుల ఎత్తున కాంశ్య విగ్రహం, విశాలమైన ఉద్యానవనం ఏర్పాటుచేస్తున్నట్లు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక జగన్నాధపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ది యంగ్‌మెన్స్ వైశ్య అసోసియేషన్, కాకినాడ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొండ బాబును సత్కరించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకుడు డాక్టర్ బాదం బాలకృష్ణ, దియంగ్ మెన్స్ వైశ్య అసోసియేషన్ అధ్యక్షుడు చెక్కా ప్రకాష్‌లు ఎమ్మెల్యే కొండబాబుకు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. బచ్చుశేఖర్, బచ్చు కామందు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు అద్దేపల్లి గంగరాజు, పుల వర్తి కుమార్, గ్రంధి నీల్, నరేష్, గునుపూడి సతీష్, మాధవరావు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

అశోక్‌గజపతిరాజుని కలిసిన వర్మ

పిఠాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్‌గజపతిరాజుని పిఠాపురం మాజీ ఎమ్మె ల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరంలోని కోటలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. విలువలతో కూడిన రాజకీయానికి దక్కిన గుర్తింపుగా వర్మ అభివర్ణించారు.

'బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

కాకినాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్ సేవలను రైతులు వినియోగించుకోవాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా కాకినాడ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ నరసింహమూర్తి కోరారు. బ్యాంకుల జాతీయాకరణను పురస్కరించుకుని స్థానిక దేవాలయం వీధిలోని ప్రధానశాఖ కార్యాలయంలో రైతులకు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ నరసింహమూర్తి మాట్లాడుతూ 1969 జూలై 19న 14 ప్రైవేటు బ్యాంకులను జాతీయాకరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించాయన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్ ఒకటో తేదీ నుంచి జూలై 31 వరకు రైతుకు అండగా నిలిచేందుకు రైతుమాసం కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, రైతు దినోత్సవాన్ని బ్యాంకులో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసి స్టెంట్ మేనేజర్ విద్యాసాగర్, ఇతర బ్యాంకుసిబ్బంది, రైతులు బీవీవీ సత్యకుమార్. యు.సాయిప్రశాంత్, ఇతర రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూ పరామర్శ

కిర్లంపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జగపతినగరం గ్రామానికి చెందిన కిర్లంపూడి హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల బాబులు అల్లుడు ఇటీవల మృతిచెందారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం బాబులు స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట ఎస్వీఎస్ అప్పలరాజు, చదరం చంటిబాబు, కుర్ల చినబాబు, తూము కుమార్, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, కాళ్ల వెంకటేష్ ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం'


నేలకోటలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

మోతుగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత జహంగీర్ తెలిపారు. శనివారం నేలకోటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటను ఎన్ని కష్టాలు ఉన్నా నిలబెట్టుకుంటామన్నారు. అలాగే ఎమ్మెల్యే శిరీషదేవి, మఠం విజయభాస్కర్ నేతృత్వంలో రంపచోడవరం నియోజకవర్గం అభివృద్ధిపథంలో దూసుకుపోతోందన్నారు. అది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు, కార్యకర్తలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం చింతూరు కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు, సీహెచ్‌సీ ఏర్పాటు, ట్రెజరీ, జీసీసీ పెట్రోల్‌బంకు, సూపర్‌మార్కెట్, 110/33 కేవీ సబ్‌స్టేషన్, ఎన్టీఆర్ జలసిరి కింద సోలార్ బోర్లు, మోటార్లు అనేక మారుమూల గ్రామాలకు రోడ్లు, బ్రిడ్జిలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సల్మాన్ రాజు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరులో ...

దేవీపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు వన్ ఏనుగులగూడెం, అగ్రహారం, తదితర గ్రామాల్లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

సాదాసీదాగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు

(అడ్డతీగల/రాజవొమ్మంగి), జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఇందులో నేతలు పాల్గొని ఆయా గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మండలంలోని ఆసుపత్రులలో పూర్తిస్థాయి మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపల్లి వీర్రాజు మాట్లాడుతూ మండలంలో చాలామంది గుండెపోటుతో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం సంబంధించిన ఇంజక్షన్లు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో లేకపోవడంతో ఇక్కడి నుంచి రోగిని మైదాన ప్రాంతాలకు తరలించే సరికి సుమారు మూడుగంటలు పడుతోందన్నారు. దీని కారణంగా గుండెపోటు వచ్చినవారు మృతిచెందుతున్నారన్నారు. గ్రామ సర్పంచ్ గొళ్లపల్లి రమణ మాట్లాడుతూ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో ఈశ్వరరావు, జడ్పీటీసీ జ్యోతి, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

రంపచోడవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ మృతి చెందడంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టబోయే ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఆదివాసీ చైతన్య సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు, ఆ సంఘ సభ్యులు శనివారం పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించండి


ర్యాలీ పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర, తదితరులు

వై.రామవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎంపీడీవో బాపన్నదొర అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి, అనంతరం మానవహారాన్ని నిర్వహించారు. అలాగే యార్లగడ్డ ఆశ్రమ పాఠశాల, మండల కేంద్రంలోని విద్యార్థులతో పరిశుభ్రత, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యార్లగడ్డ సర్పంచ్ పల్లాల పద్మావతి, టీడీపీ అధ్యక్షులు రమణారెడ్డి, జూనియర్ కళాశాల అధ్యాపకులు, సచివాలయ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు నిలిపివేత

● గోదావరి నది ఉధృతంగా ప్రవహించడమే కారణం

దేవీపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరులో వెలసిన గండిపోశమ్మ వారి ఆలయం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఆలయ అధికారులు శనివారం తెలిపారు. తిరిగి దర్శనాలు కల్పించే తేదీ ప్రకటిస్తామని, అప్పటి వరకు భక్తులు ఎవరూ ఆలయ పరిసరాల్లోకి రావద్దని సూచించారు. అలాగే గోదావరి నది వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.

ముంపు భూముల్లో వెలసిన

ఆదివాసీ జెండాలు

ఎటపాక, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలో శనివారం పోలవరం ముంపు భూముల్లో ఆదివాసీ గిరిజన సంఘం పేరిట కొందరు ఆదివాసీలు జెండాలను పాతారు. అయితే గతంలో పోలవరం ముంపునకు గురయ్యే భూముల్లో అప్పుడు రూ 1.15 లక్షల పరిహారం పొందిన వాటిలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఈ జెండాలను పాతారు. ఐదారు రోజుల వ్యవధిలో రెండు గ్రామాల్లో జెండాలను కట్టారు.ఈ క్రమంలోనే ఐదు రోజుల క్రితం మురుమూరులో భూమి కలిగిన నందిగామ గ్రామానికి చెందిన రైతు సుమారు 15 ఎకరాల సాగు భూమిని కొందరు దౌర్జన్యంగా దున్నినట్టు సదరు రైతు ఐటీడీఏ పీవోకు గ్రీవెన్స్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దానిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పీవో ఎటపాక తహశీల్దార్ కారం సుబ్బారావుకు ఆదేశించారు. కాగా భూములు ఈ ప్రాంతంలో ఉండి, కౌలుకు ఇస్తూ వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న కొందరి రైతుల భూముల్లోనే ఆదివాసీ జెండాలు కట్టినట్టు తెలుస్తోంది. కాగా ఈ విషయపై ఎటపాక తహశీల్దార్‌ను సంప్రదించగా నందిగామ గ్రామానికి చెందిన రైతు తన భూమిని కొందరు దౌర్జన్యంగా దున్నినట్టు పీవోకు ఫిర్యాదు అందించారని, దీంతో పీవో ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, పోలవరం పరిహారం పొందిన భూములా.. లేక పట్టా భూములా అనే దానిపై క్షేత్రస్థాయి విచారణ జరిపి, పీవోకు నివేదిక ఇస్తామని చెప్పారు. పీవో ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయం

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


ఆధునికీకరించిన తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసం చేసిన పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటునందించడం అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-2004 పదో తరగతి విద్యార్థులు తమ సొంత నిధులు రూ.లక్షతో ఆధునీకరించిన తరగతి గదిని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తరగతి గదిని రంగులు, టైల్స్, ఫ్యాన్లతో ఆధునీకరించడంతో ఉపాధ్యాయులు కూడా పూర్వ విద్యార్థుల సేవలను కొనియాడారు. అనంతరం విశ్రాంత ఎంఈవో ముక్క సుబ్రహ్మణ్యం, రాజులను పూర్వ విద్యార్థులు, ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల విశ్వేశ్వరరావు, మదినే స్వామి, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు కడుగుల నాగేంద్ర, శిరీష్, సింగిలిదేవ్ దొరబాబు, ఆకుల వేణుబాబు, గొప్పిశెట్టి చిన్న, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, హైస్కూల్ ఎంఈవో వి.రాజబాబు, హెచ్ఎం జాన్ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

ప్రత్తిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వెంటనే పరిష్కరించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశించారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద శనివారం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత, నూతన స్తంభాల ఏర్పాటు, వేలాడుతున్న వైర్లు, లోటట్టేజ్ వంటి సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కారానికి సత్వరం విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ, ఏడీఈ, నాలుగు మండలాల ఏఈలు పాల్గొన్నారు.

'తొలి అడుగు'కు విశేష స్పందన

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


భద్రవరంలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగుకు విశేష స్పందన లభిస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం మండలంలోని భద్రవరం గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి పథకాలను ప్రజలకు వివరించారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం


పామాయిల్ మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గండేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): జడ్.రాగంపేటలో శనివారం ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామాయిల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం నిర్వహించారు. సర్పంచ్ కందుల చిట్టిబాబు, సొసైటీ చైర్మన్ కందుల బాబ్జి, పతంజలి ఫుడ్స్ డీజీఎం ఏఎస్ ప్రకాష్, ఉద్యానశాఖాధికారి ఎ.శ్రీవల్లి హాజరయ్యారు. రైతులకు పామాయిల్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డు ఆఫీసర్ సీహెచ్‌డీవీ ప్రసాద్, ఎస్.వీర్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్.గణేష్, వి.బాలాజీ పాల్గొన్నారు.

వీరవరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ


కిర్లంపూడి: వీరవరంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరం గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొజ్జమ్మ, ఎంపీపీ తోట రవి, ఎంపీడీవో హరికృష్ణ, సత్యప్రసాద్, కార్యదర్శి రామరాజు, పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.చంద్రరావు ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను వివరించి వాడకాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐఎస్ శ్రీనివాస్, ఎంఈవో నాయక్, ఏపీవో రామకృష్ణంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రపరిచి మొక్కలు నాటారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏడిద రెడ్డి నాయుడు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి చేయూత

ప్రత్తిపాడు, జూలై19(ఆంధ్రజ్యోతి):బీజేపీ సీనియర్ నేత గున్నాబత్తుల రాజబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాజబాబు కుమార్తె ఇంటర్ విద్యకు ఆటంకం కలగకుండా శనివారం బీజేపీ జిల్లా పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ రూ.8,500 విలువైన పార్శ, నోట్‌పుస్తకాలను అందజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా వీరబాబు, నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, మండల కోశాధికారి దొడ్డిపట్ల సుబ్బరాజు, కడారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

ప్రత్తిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్‌జైలును శనివారం స్థానిక జడ్జి ఎల్.గోపీనాథ్ సందర్శించారు. ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సౌకర్యాలపై పరిశీలించారు. న్యాయవాది బుగతా శివ, వార్డెన్ ఎంఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

'దీక్షకు మద్దతు ఇవ్వండి'

శంఖవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాల నుంచి కత్తిపూడి వరకూ భారీ లారీలు చేస్తున్న విధ్వంసానికి నిరసనగా ఈనెల 21న చేపడుతున్న దీక్షకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని జనసేన నేత మేకల కృష్ణ కోరారు. శనివారం దీనికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేసి స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అందజేశారు. లారీల విధ్వంసంపై అన్నిశాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. పర్వత కృష్ణ, పగడాల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ సెంటర్ సందర్శన

ఏలేశ్వరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యర్రవరంలో నిర్మించిన హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్‌ను శనివారం జిల్లా ఉద్యానశాఖ అధికారి విజయలక్ష్మి పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ, నానిబాబు, పుష్ప, సువర్ణ, మనోజ్, నిఖిల్ పాల్గొన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పుట్టినరోజు వేడుకలు

కిర్లంపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం, జగ్గంపేట మండలాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు వచ్చి రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి శేఖర్, చందు తదితరులు ఉన్నారు.

జనసైనికుల శుభాకాంక్షలు

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పుట్టినరోజు సందర్భంగా శనివారం మండలం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కిర్లంపూడి మండలం రామచంద్రపురం వెళ్లారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి స్వామిని మణిభాస్కర్, జిల్లా చిరంజీవి యువత అధికార ప్రతినిధి నల్లల శివ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగులూరి రామ్‌దీప్‌లు రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. జనసేన నాయకులు అల్లం శ్రీను, సూరిపండు, అజయ్, గోన శివ, పితాని వీరబాబు శుభాకాంక్షలు తెలిపారు.


యనమలతో వెంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ సభ్యులు

యనమలతో ఆలయ పాలకవర్గం భేటి

తునిరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తుని పాతబజారు వీధి వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడు కుక్కడపు బాలాజీ నేతృత్వంలో కమిటీ సభ్యులు శనివారం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని కలిశారు. తమకు శ్రీవారి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించాలని నూతన కమిటీ సభ్యులకు యనమల సూచించారు.

విజేతలకు బహుమతులు

శంఖవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ చైతన్య మురళీ శనివారం కొంతంగి గ్రామంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై, సారా నిర్మూలనపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణకుమారి, రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ఏలేశ్వరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయానికి శనివారం విశ్వహిందూ పరిషత్ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పుల ఇందిర పోటీ పరీక్షలకు అవసరమయ్యే వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ, కార్యదర్శి కటకం కిరీటి, గాంధీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో నష్టాలెన్నో...

తొండంగి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చాత్రాతి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, నేషనల్ గ్రీన్ కోర్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల అనర్థాలు వివరించి, దాని వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో...

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నరావు విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంపై వివరించారు. పంచాయతీ కార్యదర్శి శివ హాజరయ్యారు. విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.


తొండంగిలో మొక్కను అందజేస్తున్న దృశ్యం

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



అన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకార సేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చి వాహనంపై ఆసీనులు గావించి బాజా భజంత్రీలతో తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చారు. పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

తునిలో కొండ నుంచి ఎగిరిపడి ఇంటిపై పడిన బండరాయి

తునిరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ పనుల కారణంగా తుని 1వ వార్డు డ్రైవర్స్ కాలనీ ప్రజలు బాంబుల భయంతో హడలెత్తుతున్నారు. శనివారం కాలనీలో పోలవరం పనులు జరుగుతున్న కొండపై నుంచి ఓ భారీ బండరాయి బాంబు పేలుడికి ఎగిరి కాలనీలో ఉన్న ఒక ప్రహరీపై పడడంతో కూలింది. అదే ఇంట్లో పని చేసుకుంటున్న దువ్వారపు వీరమణి, శాంతి గాయపడ్డారు. వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి

పోలవరం పనులు జరిగే క్రమంలో జనావాసాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అటు ఇరిగేషన్ అధికారులతో పాటు పోలవరం కాంట్రాక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని కూటమి నాయకులు సూచించారు. డ్రైవర్స్ కాలనీలో ప్రమాదానికి గురైనవారిని వారు పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, టీడీపీ నాయకులు యనమల రాజేష్, చింతనీటి అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో సుబ్బారావు

పచ్చదనం పెంపొందించేందుకు పాటుపడాలి

అన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం దేవస్థానంలో నక్షత్రవనం ప్రాంతాన్ని పరిశుభ్రపరిచారు. ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సత్యగిరి కొండపై పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, పీఆర్వో కృష్ణారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో భారీ వర్షం

జగ్గంపేట, జూలై19(ఆంధ్రజ్యోతి):జగ్గంపేటలో శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. నెల రోజుల నుంచి ఎండలతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో సేదతీరారు. వర్షం నీటితో నిండి డ్రైనేజీలు పొంగి రోడ్లపై ప్రవహించడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, జూలై19(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. జె.అన్నవరం, రమయణ్యపేట, సి.రాయవరం, జె.అన్నవరం ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. షిర్డీ నగర్, ఆర్టీసీ కాలనీ, మెక్కారావు కాలనీ, చైతన్య నగర్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గండేపల్లిలో...

గండేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం గంట కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండల తీవ్రత, ఉక్కపోతతో ఉన్నప్పటికీ సాయంత్రం భారీ వర్షం కురిసింది. రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రత్తిపాడులో...


ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రుతుపవనాల కారణంగా ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడింది. వరుసగా రెండు రోజుల నుంచి వర్షాలు పడటంతో ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన శ్రీసంస్థాన సత్రం భూముల వేలం

తొండంగి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శ్రీసంస్థాన సత్రం భూముల వేలం పాటలు శనివారంతో ముగిశాయి. ఆఖరి రోజు శనివారం 58.80 ఎకరాల భూములకు వేలం నిర్వహించగా రూ.5,14,500 ఆదాయం సమకూరింది. గతం కంటే రూ.37,600 అధిక ఆదాయం లభించింది. మొత్తంగా వారం రోజుల పాటు జరిగిన వేలం పాటల్లో 478.46 ఎకరాల భూములకు వేలం నిర్వహించగా రూ.41లక్షల 3 వేల 848 ఆదాయం సమకూరింది. గతంలో వచ్చిన ఆదాయం రూ.38,95800 కంటే ఇది రూ.2,10,48 అధికంగా సమకూరింది. ఈవో నున్న శ్రీరాములు, పర్యవేక్షణాధికారి వీర భద్రరావు, ఫణికుమార్, వాసు తదితరుల ఆధ్వర్యంలో పాటలు జరిగాయి.

దోమల నివారణకు స్ప్రేయింగ్

కోటనందూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జగన్నాధపురంలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో బాగం గా కోటనందూరులో ప్లాస్టిక్ వాడవద్దంటూ ప్రచారం చేశారు. ఎంపీడీవో వెంకటనారాయణ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

ప్రత్తిపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నవంబరులో అడ్డతీగల మండలం తిమ్మాపురం వద్ద ఏలేరు నదిలో నలుగురు వ్యక్తులు ఇసుక తవ్వకానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషి చేశారు. దీంతో టీడీపీ నాయకుడు బూరెల బాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మహిళలు, గ్రామస్తులు సత్కరించారు.

సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్

ప్రత్తిపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ చైతన్య మురళీ తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని తోటపల్లిలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, రామకృష్ణ పాల్గొన్నారు.